మన మీ..
# వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం
10 అక్టోబర్ 2026

పేజీలు : 6

@mvaartanews
www.mivaartanews.com

## పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయండి.

**- మరోసారి ఎమ్మెల్సీ బరిలో అశోక్ సార్.**

**- విలేకరుల సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్.**

**ఖమ్మం అక్టోబర్ 09 మీ వార్త ప్రతినిధి:**

పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయాలని,ఈసారి ఎన్నికల్లో విజయంనాదేననివరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ సార్ అన్నారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది రాత్రికి రాత్రే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పుట్టుక వస్తున్నారని, అటువంటి తగిన గుణపాఠం చెప్పాలని, నిత్యం జనం కోసం పనిచేసే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులకు నిధులు లేవు, నియామకాలు లేవు. ఇంటికో ఉద్యోగం లేదు, ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు లేవు. ఊకదంపుడు ఉపన్యాసాలు, 420 హామీలు తప్ప నిరుద్యోగులకు మిగిలింది శూన్యం అని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో నాన్ లోకల్ కబ్జా అత్తెసరు ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణలో నిరుద్యోగ భారతం, ప్రమాదపుటంచున ప్రభుత్వ విద్య నెలకొని ఉందని అన్నారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్యత ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడానికి తానే కారణమయ్యానని, ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించానని అన్నారు. 90శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తెలంగాణ పిసిసి రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు. బిఆర్ఎస్ సైతం ఓసీలకే టికెట్లు కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అదే జరిగితే ఆ రెండు పార్టీలను, బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు.






రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదకి తెస్తున్నాయని, జన సంబంధం లేని వారు, తెలంగాణ అస్తిత్వం తెలియని వారు, డబ్బుల సంచులతో పోటీ చేయాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం స్థానాలు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో కోర్టుల్లో నాటకలాడి బీసీలను నిండా ముంచిందని, ఇప్పుడు బీసీలకు సీట్లు కేటాయించడానికి అవకాశం ఉన్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 10 శాతం కూడా లేని ఓసీలు 70 శాతం అసెంబ్లీని కబ్జా పెట్టారని అన్నారు. గత 15 ఏండ్లుగా నిరుద్యోగుల కోసం, తెలంగాణ సమాజం కోసం పనిచేసానని అటు బిఆర్ ఎస్ ఇటు కాంగ్రెస్ రెండు పార్టీలు 18 కేసులు పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన నిరుద్యోగుల పక్షమే తప్ప ఏ ప్రభుత్వానికి అంట కాగలేదని, ప్రాణాలు ఫణంగా పెట్టి మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేసానని, లక్షల మందికి తన ఆన్‌లైన్ పాఠాల ద్వారా తక్కువ ఫీజుతో, ఉచితంగా పాఠాలు భోదించానని అన్నారు. నిరుద్యోగుల పక్షాన నడి రోడ్డుపై నిలబడి పోలీసుల దీగ్బంధాలు చేధించుకుంటూ, నిత్యం కోర్టు మెట్లు ఎక్కుతు నిలబడి గొంతు ఎత్తానని నిరుద్యోగులు, బిసిలు, ఎస్సి, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలబడతారని అన్నారు. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతుందని, నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని పాతంలోకి తొక్కుతారని విమర్శించారు. తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పన తన ఎన్నికల నినాదంని ప్రకటించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్ లో 5300 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సిని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటివరకు దిక్కు లేదన్నారు.సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు. 33 జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. పేరుకే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, తెలంగాణ అస్తిత్వంను ఆంధ్రుల గుప్పెట్లో పెట్టారని భౌగోళిక తెలంగాణ తప్ప సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని, తెలంగాణ ఉన్నత కులాల చేతిలో బందీ అయ్యిందని, ఎస్సీ ఎస్టీ, బిసి వర్గాల్లో చైతన్యం ఓటు రూపంలో వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలందరూ ఐక్యమైనప్పుడే మనకు న్యాయం జరుగుతుంది. ఈ ఊడిగం ఇంకా ఎన్నాళ్లు అని ప్రశ్నించారు. మేమెంతో మాకంత నినాదంతో చేతులు బిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి గౌడ్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు భద్రు నాయక్, నాగరాజు, జి.వెంకటనారాయణ, ప్రణీత్, కృష్ణ,బి రమేష్,డి ఉదయ్ సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా మిస్టర్ ఇండియా అవార్డు

**నేలకొండపల్లి అక్టోబర్ 09 మీ వార్త ఆర్ సి :**

నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులోని పబ్లిక్ గార్డెన్స్ లో గల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో మిస్టర్






ఇండియా అవార్డు లభించింది.ఈ అవార్డును గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా అనుకోవడం జరిగింది. మేక్ అప్ తెలంగాణ సంస్థ వారు దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ అవార్డును ఇస్తున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ దివ్యమూర్తి లాంటి ప్రభావంతులు సమాజానికి ఎంతైనా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ తనను గుర్తించి ఈ అవార్డు ఇచ్చినందుకు సంస్థ వారికి ధన్యవాదములు తెలియజేస్తూ,ఈ అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 86 అవార్డులు వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర చారి, సురేందర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, మధుసుహాన్, మీర్ జుల్ఫికర్అలీ, జక్కుల లక్ష్మణ్, దివ్యమూర్తి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలి..కెవిరామిరెడ్డి డిమాండ్.



**నేలకొండపల్లి అక్టోబర్ 09 మీ వార్త ఆర్ సి :**

నేలకొండపల్లి మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోఎంపీడీఓ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రామిరెడ్డి మాట్లాడుతూ, ఎలినినో ప్రభావం వలన మండలంలో అరకొరగా వేసినప్రత్తివారం పది రోజుల్లోతీతలైపోతే ఎలాంటి పని లేక కూలీలు ఇబ్బందులుపడతారని,వెంటనే పేద ప్రజలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని,ఉపాధిపనిలో రోజుకి 600/కూలి ఇవ్వాలని,ఈ సంవత్సరం200 రోజులు పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకువ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని,కొత్త కుటుంబాలకు ఉపాధి హామీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రెండు లక్షల కోట్ల రూపాయలు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండలఅధ్యక్ష కార్యదర్శులు దుగ్గి నరసింహారావు పెదపాక మల్లేశ్వరరావు రైతు సంఘం మండల కార్యదర్శి రచ్చ నరసింహరావు సిఐటియు మండల కన్వీనర్ పి నాగేశ్వరరావు సంఘ నాయకులు షేక్ మైమద్, కాలువ కోటేశ్వరరావు,గాదె వెంకటేశ్వరరావు,మందడపు మురళి, డి నాగేశ్వరరావు, మల్లికార్జున, పెద్దిరాజు నరసయ్య, వాసంశెట్టి నరసయ్య, బషీరుద్దీన్, కొత్తూరు వెంకటాచారి, మల్లికార్జున్, లక్షాధి, జి మధు, తదితరులు పాల్గొన్నారు.

## పశుగణాభివృద్ధి సమస్తపశువర్ధన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరం

**నేలకొండపల్లి అక్టోబర్ 09 మీ వార్త ఆర్ సి :**



నేలకొండపల్లి పశు గణాభివృద్ధి సమస్త పశువర్ధన శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరం తిరుమలాపురం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ క్రమ ధన ప్రవీణ్ ప్రారంభించారు ఈ శిబిరంలో చెరువు మాదారం పశువైద్యాధికారి సాహిత్య నేలకొండపల్లి పశువైద్యాధికారి శ్రీనివాసరావు రాజేష్ పురం పశువైద్యాధికారి సిహెచ్ భువనేశ్వర్ కుమార్ పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులు నివారణ వెలుగుదల పశువులను గుర్తించడం లేత దూడలకు నట్టల మందులు ఉచితంగా పంపిణీ చేశారు కృత్రిమ గర్భధారణ మందులను తెలియజేశారు పశువుల ప్రాముఖ్యత గురించి డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ వివరించారు ఈ కార్యక్రమం ఈ శిబిరంలో గోపాలమిత్ర సూపర్వైజర్ మోతుర్ వెంకటేశ్వర్లు ఏ ఈ ఓ రామారావు స్థానిక గోపాల్ మిత్ర ఆంజనేయులు నాగేశ్వరావు పాండురంగయ్య గ్రామ పెద్దలు శిబిరంలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కాలనీ ఖబరస్తాన్ స్థల సమస్యకు పరిష్కారం చూపాలి.

**- డీఎఫ్ఓకు కాంగ్రెస్ నాయకులు ఎం.డి. కమల్ పాషా వినతి.**

**సత్తుపల్లి అక్టోబర్ 09 మీ వార్త టౌన్ రిపోర్టర్:**

సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీలోని ఖబరస్తాన్ స్థలానికి సంబంధించిన సమస్యను తక్షణమే పరిష్కరించి, ముస్లిం మైనారిటీ ప్రజల ఇబ్బందులను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎం.డి. కమల్ పాషా ఆధ్వర్యంలో నాయకులు డీఎఫ్ఓను కలిసి ఈ సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కాలనీ ఖబరస్తాన్ స్థలానికి సంబంధించిన సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ముస్లిం మైనారిటీ ప్రజల అవసరాలు, మనోభావాలను దృష్టిలో ఉంచుకొని న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని కోరారు. ఖబరస్తాన్ స్థల



సమస్యకు పరిష్కారం లభిస్తే స్థానిక ముస్లిం మైనారిటీ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని ఈ



సందర్భంగా తెలిపారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ శరత్, 4వ వార్డు కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, 9వ వార్డు కౌన్సిలర్ జగన్నాథం శ్రీను, మసీదు కమిటీ సభ్యులు డాక్టర్ ముజ్జు, జెన్నీ, ఎల్ఐసీ జానీ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాల కల్పనకు ప్రభుత్వ భూమి పరిశీలన.





**- అర్హులైన పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం: మట్టా దయానంద్ విజయ్ కుమార్.**

**సత్తుపల్లి అక్టోబర్ 09 మీ వార్త అర్ సి:**

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కల్పించి, వారు సొంత ఇంటిని నిర్మించుకునేలా కృషి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ శుక్రవారం సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, గౌరీగూడెం గ్రామాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. తహసీల్దార్‌తో కలిసి ఆయన భూముల వివరాలను తెలుసుకుని, అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించే అవకాశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు.సిద్ధారం రెవెన్యూ పరిధిలోని ఏనుగుట్ట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాల కోసం వినియోగించవచ్చా అనే అంశాన్ని పరిశీలించారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి, అక్కడ నివాస గృహాలు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు అవసరమైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం జీవితంలో ఒక ముఖ్యమైన కల అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించి, వారు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం, స్థానికంగా నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

## నారాయణ పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు.

**ఖమ్మం, అక్టోబర్ 09,మీ వార్త ప్రతినిధి :**







ఖమ్మంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నారాయణ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి, ఉత్సాహభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా విద్యార్థినులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మన పండుగల విశిష్టతను భావితరాలకు అందించడం, విద్యార్థుల్లో ప్రాంతీయ సంస్కృతి పట్ల గౌరవం, ఐక్యతాభావాన్ని పెంపొందించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశ్యం.మన సంస్కృతి మన గౌరవం మన సంప్రదాయాలు మన వారసత్వం అనే సందేశంతో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. సంప్రదాయాల పరిరక్షణకు, విద్యార్థుల సమగ్ర వికాసానికి నారాయణ పాఠశాల కట్టుబడి ఉందని ఖమ్మం నారాయణ విద్యా సంస్థల ఏ.జి.ఎం ఎస్.రాంకీ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ క్రాంతి కుమార్, కోఆర్డినేటర్స్ ప్రవీణ్ కుమార్, వినోద లక్ష్మి , నీలిమ,పాఠశాల ప్రిన్సిపల్ జి. నవీన్ కుమార్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు తల్లిదండ్రుల పాల్గొని విజయవంతం చేశారు.

## తిప్పాపురంలో వైద్య శిబిరం.. 66 మందికి వైద్య సేవలు

**- జ్వరంతో బాధపడుతున్న ముగ్గురికి ప్రత్యేక పరీక్షలు**

**చర్ల, అక్టోబర్ 9: మీ వార్తా ప్రతినిధి :**




సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పాపురం గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

శిబిరంలో మొత్తం 66 మందికి వైద్య సేవలు అందించగా, జ్వరంతో బాధపడుతున్న ముగ్గురిని గుర్తించారు. వారికి అవసరమైన జ్వర నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలను సేకరించి తదుపరి పరీక్షల కోసం పంపించారు. సాధారణ జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి మందులు అందించారు. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామస్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని బాగా మరిగించి చల్లార్చిన తర్వాతే తాగాలని సూచించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్త ఐ. దీప్తి మౌనిక, సహాయక నర్సు ఐ. శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ ఎన్. సునీతతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి-వేంసూరు రోడ్డుపై డైవర్షన్తో వాహనదారుల అవస్థలు!

**- గమ్యస్థానాలకు చేరాలంటే తప్పని తిప్పలు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి!**

**సత్తుపల్లి అక్టోబర్ 09 మీ వార్త అర్ సి :**




సత్తుపల్లి-వేంసూరు రోడ్డుపై డైవర్షన్ కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకల సమయంలో ప్రయాణికులు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారు రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురుచూస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పనులు పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఉపశమనం కలగనుంది. ప్రజల ఇబ్బందులకు త్వరగా పరిష్కారం చూపాలి,రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి.

## ఉపాధీ పనులు కల్పించి ఆదుకోవాలి

**- ఎంపీడీవో కు వ్యకాస వినతి**

**కారేపల్లి అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి:**



ఉపాధీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కు వినతిపత్రం అందజేశారు. ఎలినినో ప్రభావతం గ్రామాలలో రైతులు పంటలు వేయక వ్యవసాయపనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వారికి వీబీజీ రాంజీ క్రింద పనులుకల్పించాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వ్యవసాయ సాగుతో జనవరి వరకు వ్యవసాయ పనులు దొరికే వనినేడు కరువు పరిస్థితులతో వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని అక్కడ కూడా పనులు లేక రోడ్ల వెంట తిరగాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించే ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని 200 రోజులు రూ. 700 కూలితో కల్పించాలని కోరారు. ఉపాధీ పనిలో కొలతలు, రెండు పూటల పోటోలుతీయటం వంటి నిబంధనలు ఇబ్బందికరంగా మారాయన్నారు. వీబీజీ రాంజీ బిల్లుతో కూలీలు పని హక్కు కోల్పోతారన్నారు.దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలోభాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద ప్రతి కూలీకి ఏడాదికి రూ.12వేలు అందించాలని రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసరవస్తువులు పేదలకు అందజేయాలనికోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు కేసగాని ఉపేందర్, నాయకులు చల్లా మల్లమ్మ, సీఐటీయు నాయకులు శనగ రాంబాబు, జీ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛ భారత్ చిత్రలేఖనం పోటీలు.

**సత్తుపల్లి అక్టోబర్09మీ వార్త అర్ సి :**



సత్తుపల్లి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకొని, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులకు స్వచ్ఛ భారత్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, కె. శైలజ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.పట్టణ బీజేపీ అధ్యక్షుడు బానోత్ విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ నంబూరి రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన డి. వికిల్ సాక్షిత్ ప్రథమ బహుమతి, కె. ప్రదీప్ ద్వితీయ బహుమతి, కె. రీనా హర్షిని తృతీయ బహుమతి సాధించారు. రామలింగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా జీవిత ప్రస్థానం గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమై ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహిస్తున్న వరకూ ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదల సంక్షేమం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి మంద శివ, నాగ మౌనిక, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గురుదేవ్ విద్యాలయంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**- విద్యతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం**

**చర్ల: అక్టోబర్ 9 మీ వార్తా ప్రతినిధి :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో పండుగ సందడి నెలకొనగా, విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలు పాఠశాల ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. విద్యార్థినుల ఉత్సాహం, సంప్రదాయ దుస్తులు, బతుకమ్మ పాటలతో వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవం పెంపొందించడంతో పాటు ప్రకృతిని ప్రేమించడం, పూల విశిష్టతను గుర్తించడం, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం వంటి విలువలను తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్య అంటే కేవలం పాఠ్యాంశాలను నేర్చుకోవడమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, మానవీయ విలువలను భావితరాలకు అందించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యను అభ్యసిస్తూనే తమ సంస్కృతి మూలాలను మరచిపోకుండా, సంప్రదాయాలను గౌరవిస్తూ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థినులు, ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొనడంతో గురుదేవ్ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు విజయవంతంగా ముగిశాయి.







# క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య శిబిరం వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు

**చర్ల: అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి :**




క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప్పరిగూడెంలో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడం, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించడం, సకాలంలో వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

శిబిరంలో క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించేందుకు ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, శరీర బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు.

క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య సిబ్బంది పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ వైద్య శిబిరంలో చర్ల వైద్యాధికారి, ఉప్పరిగూడెం సర్పంచ్, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు గోపీ, ఆరోగ్య సహాయకుడు ధర్మ, మధ్యస్థ ఆరోగ్య సేవల అధికారి గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు -- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు**

**సత్తుపల్లి అక్టోబర్09మీ వార్త అర్ సి :**




సత్తుపల్లితెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సత్తుపల్లిలోని నారాయణ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూల పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూలతో, పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. తల్లిదండ్రులు సైతం కార్యక్రమంలో భాగస్వాములై వేడుకలకు మరింత శోభను చేకూర్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతాభావాన్ని, సామాజిక స్పృహను, మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీ ఎం రామ్‌కీ , ఆర్ఐ క్రాంతి , కోఆర్డినేటర్లు వినోద లక్ష్మి , నీలిమ, వైస్ ప్రిన్సిపాల్స్ రమ్య,దివ్య పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమిష్టి భాగస్వామ్యంతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు అందరిలో ఆనందోత్సాహాలను నింపాయి. సంప్రదాయాల పరిరక్షణలో విద్యాసంస్థల పాత్రను చాటిచెప్పిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

## విద్యాలయాలలో బతుకమ్మ సంబురాలు ఆట పాటలతో అలరించిన చిన్నారులు



కారేపల్లి అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి:



కారేపల్లిలోని వివిధ విద్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరిపారు. శనివారం నుండి విద్యార్థులకు దసరా సెలవులు ఇస్తున్న సందర్భంగా ముందస్తుగాపాఠశాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కారేపల్లి బ్రిలియంట్ స్కూల్, కేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మ లను అలంకరించి వాటి చుట్టూ చేరి బతుకమ్మ ఆట, పాటలతో అలరించారు. బ్రిలియంట్ స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పూలనే దేవతా స్వరూపంగా భావించి పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. పూలకు ప్రకృతికి, మహిళలకు విశిష్ట స్థానం కల్పించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఝున్సీసౌజన్య, కేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ వాంకుడోత్ కోటేశ్వరరావు బతుకమ్మ పండుగ విశిష్టతనువివరించారు. తెలంగాణ ప్రజల ఐక్యతను బతుకమ్మ పండుగ చాటి చెప్పిందన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.

- ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ హాజరు.




ఖమ్మం, అక్టోబర్ 09 మీ వార్త ప్రతినిధి :

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ డిమాండ్ చేశారు.గత పార్లమెంటు ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని పేర్కొన్నారు.జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించ తలపెట్టిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డితో కలిసి వేజండ్ల సాయికుమార్ ఈరోజు ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు.ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ఓటు హక్కు పవిత్రతను పరిరక్షించాలని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సాయి డిమాండ్ చేశారు.జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండే వరకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కామేపల్లి మండలం లో డీపీవో వినోద్ విస్తృత పర్యటన

- క్షేత్రస్థాయిలో నూతన పెన్షన్ ల పై విచారణ
- ఇంకుడు గుంతల పరిశీలన

కామేపల్లి, అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి :



కామేపల్లి మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. కొమ్మినేపల్లి పంచాయతీలో ఉపాధి పనులకు వెళుతున్న కూలీలతో మాట్లాడారు.రోజు ఉపాధి పనికి వెళ్తే కూలీ ఎంత పడుతుందని కూలీలను ప్రశ్నించారు.గ్రామంలో ఇతర పనులు దొరుకుతు న్నాయా అని ఆరా తీశారు. అనంతరం ముచ్చర్ల గ్రామ పంచాయతీలో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు.ఇంకుడు గుంతలు త్వరతిగతిన పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు.గ్రామాల్లో ఇతర పనులు లేవని ఉపాధి పనులకు వచ్చే కూలీలకు పనులు కల్పించాలని సూచించారు.అదే విధంగా సాతానిగూడెం గ్రామంలో కొత్తగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వి వి ఎస్ శాస్త్రి,ఏపీవో అద్దంకి శ్రీరాణి, ఈ సి దామళ్ళ వెంకటేశ్వర్లు,సాతాని గూడెం సర్పంచ్ భూక్య రెడ్యా, ముచ్చర్ల , సాతానిగూడెం పంచాయతీ కార్యదర్శులు పి.అనురాధ, సిహెచ్ లావణ్య,ఉపాధి హామీ పథకం టెక్నికల్ ,ఫీల్డ్ అసిస్టెంట్లు,మెట్లు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

- పాండవ చలక కాలనీ పీహెచ్ సీ స్కూల్లో సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు
- చిన్నారుల కోలాటం, బతుకమ్మ నృత్యాలు ఆకట్టుకున్నాయి

నేలకొండపల్లి అక్టోబర్ 9 మీ వార్త ఆర్ సి :

నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామం పాండవ చలక కాలనీలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. స్థానిక పీహెచ్ సీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు రహేనా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు గ్రామంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పాఠశాల ప్రాంగణమంతా మర్రి, గునుగు, తంగేడు పూలతో రంగురంగుల బతుకమ్మలతో కళకళలాడింది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేసిన కోలాటం నృత్యాలు, బతుకమ్మ చప్పట్లు, జానపద పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు పాడిన "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటలతో పాఠశాల మార్మోగింది.

**ముఖ్య అతిథిగా ఎంఈఓ చలపతిరావు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) చలపతిరావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి బతుకమ్మ ఒక ప్రత్యేకమైన



సాంస్కృతిక పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని కొనియాడారు."ప్రతి పాఠశాలలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుంది. మహిళలంతా కలిసి ఈ పండుగను ఐక్యతతో జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు.ప్రధానోపాధ్యాయురాలు రహేనా మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే ఈ సంబరాలు నిర్వహించామని తెలిపారు.



అనంతరం అత్యంత అందంగా బతుకమ్మను పేర్చిన విద్యార్థినులకు, ఉత్తమ నృత్య ప్రదర్శన చేసిన బృందాలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. చుక్కారావు, డి. జయమ్మ, లలిత, కృష్ణారావు, పీఆర్టీయూ మండల కార్యదర్శి సురేష్, వెంకటేశ్వర్లు, మంజులత, గ్రామ ఉప సర్పంచ్ నెమలి జ్యోతి, వార్డు సభ్యులు సుల్తాన్, వీరబాబు, రమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చివరిలో గ్రామ మహిళలంతా కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడిపాడారు.

## శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలోసైబర్ భద్రతపై అవగాహన సదస్సు.

ఖమ్మం, అక్టోబర్ 09,మీ వార్త ప్రతినిధి :

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే శ్రీరామరక్ష-ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. ముఖ్యంగా యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని బ్యాంకు అధికారులమని ఫోన్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించడం, నకిలీ లింకులు పంపడం, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు ఆశ చూపించడం, ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం వంటి పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. కొందరు వ్యక్తులు పోలీసులమని, ఇతర ప్రభుత్వ అధికారులమని చెప్పి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తొందరపడి డబ్బులు పంపవద్దని సూచించారు.

బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవడం, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఇతరులకు ఫోన్ స్క్రీన్‌ను షేర్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, రెండు దశల ధృవీకరణ టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి గారు మాట్లాడుతూ, సైబర్ నేరాల నివారణకు పోలీసుల చర్యలతో పాటు ప్రజల్లో



అవగాహన పెంపొందించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు తమకు తెలిసిన సైబర్ భద్రతా అంశాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన లేని కుటుంబ సభ్యులకు తగిన సూచనలు చేయాలని అన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అత్యవసరంగా డబ్బులు పంపాలని కోరినా, బహుమతులు లేదా అధిక లాభాలు వస్తాయని ఆశ చూపినా, ముందుగా నిజానిజాలు నిర్ధారించుకోవాలని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ వెంకట చలపతి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులు, వాటి వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, సందేశాలు, స్క్రీన్‌షాట్‌లు,







బ్యాంకు లావాదేవీల వివరాలను భద్రపరచుకోవాలని తెలిపారు.

ఈ సదస్సులో సైబర్ సెక్యూరిటీ విభాగ ఏ సి పి ఫణింద్ర మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగే విధానాలు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార పరిరక్షణ, డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తత, సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసే విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యార్థులు తమతో పాటు కుటుంబ సభ్యులను కూడా అప్రమత్తం చేసి సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ కూసుమంచి, నెలకొండపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, సబ్ ఇన్స్పెక్టర్ లు ,కలశాల డీన్ డాక్టర్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నవజాత శిశు అంబులెన్స్‌లో వైద్య సదుపాయాల తనిఖీ

మందులు, వైద్య పరికరాలు, రికార్డుల పరిశీలన

అత్యవసర సమయాల్లో శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**కామారెడ్డి :** వజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్య సేవలు అందించేందుకు వినియోగిస్తున్న అంబులెన్స్‌లో వైద్య సదుపాయాలు, మందులు, వైద్య పరికరాలు, ఇతర అవసరమైన సామగ్రిని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధికారులు తనిఖీ చేశారు. కామారెడ్డిలో నిర్వహించిన ఈ తనిఖీలో అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య సామగ్రితో పాటు మందుల నిల్వలు, వైద్యానికి ఉపయోగించే వస్తువులు, వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నవజాత శిశువుల అత్యవసర వైద్య సేవల నిర్వహణలో భాగంగా అంబులెన్స్‌లో అవసరమైన అన్ని వస్తువులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్ కుమార్, కామారెడ్డి కోఆర్డినేటర్ తిరుపతి అంబులెన్స్‌ను సందర్శించి తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) శంకర్, పైలట్ సుదర్శన్ సమక్షంలో వైద్య సామగ్రి, మందులు, ఇతర అవసరమైన వస్తువులను పరిశీలించారు. అదేవిధంగా వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, వాటి నిర్వహణ తీరును సమీక్షించారు.

**వైద్య సామగ్రి, మందుల నిల్వలపై ప్రత్యేక పరిశీలన**

నవజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్‌లో ఉపయోగించే మందులు, వైద్య పరికరాలు ఎంతో కీలకమైనవి. ఈ నేపథ్యంలో అధికారులు అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న మందులు, వైద్యానికి ఉపయోగించే వస్తువులు, ఇతర అత్యవసర సామగ్రిని పరిశీలించారు. వైద్య సేవలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండటంతో పాటు వాటికి సంబంధించిన



వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదు అవుతున్నాయా అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందులు అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉండటం అవసరం. ముఖ్యంగా నవజాత శిశువులకు సంబంధించిన వైద్య సేవల్లో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేకుండా అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచడం ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ దృష్ట్యా అంబులెన్స్‌లోని వైద్య సదుపాయాలను అధికారులు పరిశీలించారు.

**రికార్డుల నిర్వహణపై సమీక్ష**

అంబులెన్స్‌లో వైద్య సేవలకు ఉపయోగించే మందులు, వస్తువులు, ఇతర సామగ్రికి సంబంధించిన రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. వైద్య సామగ్రి వినియోగానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడం, అవసరమైన వస్తువుల లభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించడం, అంబులెన్స్‌ను వైద్య సేవలకు అనుగుణంగా సిద్ధంగా ఉంచడం వంటి అంశాల ప్రాధాన్యతను ఈ తనిఖీ ద్వారా గుర్తించారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణలో అత్యవసర అంబులెన్స్ సేవలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. శిశువులకు తక్షణ వైద్య సహాయం అవసరమైన సందర్భాల్లో అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందులు ఎంతో ఉపయోగపడతాయి. అందువల్ల అంబులెన్స్‌లోని వైద్య సదుపాయాలను క్రమం తప్పకుండా పరిశీలించడం, వైద్య సామగ్రి నిల్వలను పర్యవేక్షించడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం అవసరం.



**సిబ్బంది సమన్వయంతో మెరుగైన సేవలు**

అంబులెన్స్ సేవలు సమర్థవంతంగా కొనసాగాలంటే జిల్లా స్థాయి అధికారులు, కోఆర్డినేటర్లు, వైద్య సిబ్బంది, పైలట్లు సమన్వయంతో పనిచేయడం అవసరం. ఈ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మేనేజర్ సందర్శనలో భాగంగా నిర్వహించిన తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది. అంబులెన్స్‌లోని వైద్య సామగ్రి, మందులు, ఇతర అవసరమైన వస్తువులు, రికార్డులను పరిశీలించడం ద్వారా సేవల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్ కుమార్, కామారెడ్డి కోఆర్డినేటర్ తిరుపతి, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శంకర్, పైలట్ సుదర్శన్ పాల్గొన్నారు. నవజాత శిశువులకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లోని వైద్య సదుపాయాలు, అవసరమైన సామగ్రి, రికార్డుల నిర్వహణను పరిశీలించడం ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశంగా నిలిచింది.

# వైభవోపేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ నిర్వహించాలి.





**- తిరుమల తరహాలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**- అక్టోబర్ 12న అల్లిపురంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయ భూమిపూజ**

**- ఆలయ నిర్మాణ ప్రాంగణాన్ని, భూమిపూజ ఏర్పాట్లను పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల.**

**ఖమ్మం, అక్టోబర్ -09 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి మంత్రి భూమిపూజ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ సోమవారం అల్లిపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. దేవదేవుని ఆశీస్సులతో ఖమ్మం నగరంలో స్వామివారి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమని తెలిపారు. ఆలయ నిర్మాణం, నిర్వహణ బాధ్యత పూర్తిగా తిరుమల తిరుపతి దేవస్థానానిదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు ఖమ్మం నగరంలోనూ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. భక్తిభావం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలి ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. పూజా కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను విస్తృతంగా చేపట్టాలని, ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా చూడాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ తదితర శాఖల అధికారులు సమన్వయం తో

పనిచేయాలని, అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి శాఖకు నిర్దిష్టబాధ్యతలు అప్పగించాలని తెలిపారు. అధికారులు అంకితభావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తిరుమల తరహాలో క్యూలైన్లు, బారికేడ్లుతిరుమలలో అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకుని భక్తుల రాకపోకలకు అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి పూజ ప్రాంగణం, భోజన కేంద్రాలు, ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎక్కడా తొక్కిసలాటకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అన్నప్రసాదం, పులిహోర సమృద్ధిగా అందించాలిభూమిపూజ కార్యక్రమానికి ఎంతమంది భక్తులు వచ్చినా అందరికీ నాణ్యమైన భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి తెలిపారు. భూమిపూజ జరిగే ప్రాంతానికి దూరంగా భోజన కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎక్కువ సంఖ్యలో ఆహార పంపిణీ కౌంటర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రసాద పంపిణీ కేంద్రాలను పెంచాలని, ప్రసాదం కోసం వచ్చే భక్తులకు క్రమబద్ధమైన క్యూలైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సంఖ్యలో త్రాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. పార్కింగ్, వైద్య, విద్యుత్ సదుపాయాలు కల్పించాలిభక్తులు నాలుగు వైపుల నుంచి వచ్చే మార్గాలకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని మంత్రి సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, వాహనాల రాకపోకల మార్గాలు, భక్తులు ప్రాంగణానికి చేరుకునే దారులకు సంబంధించిన వివరాలను మ్యాప్‌తో సహా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ వివరాలను పోలీస్ శాఖ ద్వారా పాత్రికేయులకు అందించి, భక్తులకు ముందుగానే సమాచారం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలనిసూచించారు. పుష్కరాల తరహాలో వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది, అవసరమైన వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాంగణంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే పాత్రికేయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్టీలకతీతంగా భక్తులందరూ పాల్గొనాలి ఖమ్మం నగరంలో ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి పనులు

చేపట్టామని, అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను ఒప్పించి రహదారుల విస్తరణ పనులు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఆలయం నిర్మించడం ఈ ప్రాంత ప్రజలకు దేవదేవుడు అందించే గొప్ప ఆశీర్వాదమని పేర్కొన్నారు. తిరుమలలో పాటించే క్రమశిక్షణ, భక్తిభావం, నిర్వహణ విధానాలు ఖమ్మం ఆలయంలోనూ అమలవుతాయని తెలిపారు.

పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరై దేవదేవుని ఆశీస్సులు పొందాలని మంత్రి కోరారు. కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో విజయవంతం చేసేందుకు భక్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మాణం జరగడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణంపై ప్రజలు ఎంతో ఆసక్తి, భక్తిశ్రద్ధలు కనబరుస్తున్నారని పేర్కొన్నారు. భూమిపూజకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపడతామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీటీడీకి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పోలీస్ శాఖ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, భోజన కేంద్రాలు, ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణతో పాటు కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామనివెల్లడించారు. మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ భూమిపూజ కార్యక్రమం సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాంగంతో చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, టిటిడి దేవస్థానం, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పూల పండుగకు విద్యార్థుల కళా నీరాజనం





**బతుకమ్మ పాటలు, కోలాటాలతో బిర్లా పాఠశాలలో సందడి**

**బిర్లా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**వరంగల్ :** వరంగల్ ని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు తెలంగాణ పూల పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, చిన్నారుల నృత్యాలు, విద్యార్థుల కళా ప్రదర్శనలు, సంప్రదాయ ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా పాల్గొనడంతో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బిర్లా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కళారూపాలు, నాట్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. చిన్నారులు తమ ప్రతిభను వేదికపై ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల సృజనాత్మకతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి అద్భుతమైన ప్రతీక అని అన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం మన ప్రాంతీయ గుర్తింపును చాటిచెబుతుందని అన్నారు. పాఠశాలల్లో పండుగలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు పుస్తకాల ద్వారా లభించే జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అనుభవం కూడా కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు చక్కని వేదికగా నిలుస్తాయని, ఇలాంటి వేడుకలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చదువుతో పాటు కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే విద్యార్థుల సమగ్ర వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బతుకమ్మ సంబరాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో వేడుకలు మరింత కళకళలాడాయి. విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. పాఠశాల వేదికగా విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఒకచోట చేరి పండుగను జరుపుకోవడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో బతుకమ్మ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు చైర్మన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభకు తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శనలు చేయడానికి ప్రేరణ లభిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయాల పరిమళాన్ని విద్యార్థుల కళా ప్రదర్శనలతో మేళవించిన బతుకమ్మ వేడుకలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నింపాయి. సంస్కృతిని గౌరవిస్తూ, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

## జింకల బంజర పాఠశాలలో ఆనందోత్సవాలతో బతుకమ్మ సంబరాలు

**- ఆడి పాడి సందడి చేసిన కెప్టెన్ బంజర సర్పంచ్ అచ్చమ్మ**

**కామేపల్లి, అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి :**





కామేపల్లి మండలం జింకల బంజర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. సంబరాలలో కెప్టెన్ బంజర సర్పంచ్ ఆరేం అచ్చమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలసి బతుకమ్మ పాటలకు ఆడి పాడి సందడి చేశారు. ఘనంగా నిర్వహించిన ఈ సంబరాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.వెంకటేశ్వర్లు,సహో ఉపాధ్యాయుడు ధారవత్ శీను,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ ఖాసిం, వెన్ను హరికృష్ణ, గుగులోత్ కృష్ణ ,మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం బంజారా ఆడబిడ్డలకు సాంప్రదాయ వస్త్రాలను అందజేయాలి

**- జిల్లా కలెక్టర్ కు విన్నవించిన ఆంగోత్ రమేష్ సాధు**

**కామేపల్లి, అక్టోబర్ 9 మీ వార్త ప్రతినిధి :**



బంజారా ఆడబిడ్డలకు సాంప్రదాయ దుస్తులను ప్రభుత్వం అందజేయాలని కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఆంగోత్ రమేష్ సాధు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ను కలిసి ఈ మేరకు విన్నవించారు. మండలం పూర్తి ఏజెన్సీ మండలం అని, బంజారా ఆడబిడ్డలు ఎక్కువ మంది ఉన్నందున సాంప్రదాయ దుస్తులు అందజేయాలని తద్వారా సంత సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు,తీజ్ ఉత్సవాలను ఆయా వస్త్రాలతో విజయవంతంగా జరుపుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బంజారా గిరిజనుల కుల పండుగలను, ఉత్సవాలను ఘనంగా జరుపుకొని సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పేందుకు సాంప్రదాయ వస్త్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ నేపథ్యంలో వస్త్రాలను అందజేసి ఉత్సవాలను విజయవంతంగా జరుపుకునేందుకు సహకరించాలని రమేష్ సాధు కలెక్టర్ కు విన్నవించడం జరిగింది.

## అంగన్ మిలన్ సేవా"బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్



**శేరిలింగంపల్లి :** మదినగూడ డివిజన్ లో, మండల ప్రజా పరిషత్ "అంగన్ మిలన్ సేవా" కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది,బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్ - 2026, సందర్భంగా,ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకొని, మదినగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు వై రాజు యాదవ్ ఆధ్వర్యంలో, గంగారం గ్రామం అంగన్వాడీ,కేంద్రంలో,"అంగన్ మిలన్ సేవా" కార్యక్రమం నిర్వహించడం జరిగింది, అంగన్వాడీ కేంద్రన్నీ సందర్శించి కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ గురించి చర్చించి, అనంతరం అంగన్వాడీ సిబ్బందిని, శాలువాతో సత్కరించి, పిల్లలకు పండ్లు,బిస్కెట్లు మరియు ఆట వస్తువులు పంపిణీ చేయడం జరిగింది,ముఖ్య అతిథిగా, డాక్టర్ అజిత్ సేనాపతి బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మేరీ మేడంగారు మరియు సీనియర్ నాయకులు దేవల్ యాదవ్ ,మాజీ కౌన్సిలర్ రమణయ్య సత్యనారాయణ రాజు ఓబీసీ మోర్చా సురేష్ కుర్మ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఓబిసి మోర్చా కార్యదర్శి రామ్ రెడ్డి రామ్మోహన్ శేఖర్ ముదిరాజు అశోక్ ముదిరాజ్ స్వామి నరసింహ యాదవ్ రాజు ముదిరాజ్ దేవేందర్ దేవేందర్ రావు పాలెం శ్రీనివాస్ యాదవ్ , బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనరు.

## పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి.

**రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ - కొత్వాల.**



ఖమ్మం-నల్గొండ- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గ్రాడ్యుయేట్ యువకులు తమ సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు ప్రతి ఒక పట్టభద్రుడి భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందు తప్పనిసరిగా ఓటర్ నమోదు చేయించుకోవాలని అన్నారు. నిర్ణీత గడువు లోగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేయించుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కొత్వాల అన్నారు. పట్టభద్రుల ఆశయాలను శాసనమండలిలో బలంగా వినిపించే అవకాశం కాంగ్రెస్ అభ్యర్థిని ఎన్నుకోవడం ద్వారా కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు విధిగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించేలా కృషి చేయాలి - కొత్వాల ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఓట్లు విధిగా నమోదు చేయించేలా కృషి చేయాలని కొత్వాల పిలుపు నిచ్చారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త (గ్రాడ్యుయేట్) తమ ఓటును నమోదు చేసుకోవడంతో పాటు తమకు తెలిసిన వారి ఓట్లు కూడా నమోదు చేయించేలా కృషి చేయాలని కొత్వాల కోరారు.

బిజినెస్

# జీఎస్టీ కొత్త రూల్స్.. రియల్ ఎస్టేట్‌కు రిలీఫ్ ఇదే..

## భారత్‌లో టెస్లా దూకుడు.. మరో నగరంలో కొత్త సెంటర్!




అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించడంతో సన్నద్ధమైంది. ఇందులో భాగంగానే.. కంపెనీ తాజాగా నోయిడాలో కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 9న విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. నోయిడాలోని సెక్టార్ 98లో ఉన్న స్కైమార్క్ వన్‌లో కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించనుంది. అయితే.. ఇది ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని సంస్థ అధికారికంగా వెల్లడించలేదు. ఇప్పటికే ఢిల్లీ, గురుగ్రామ్‌లలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించిన టెస్లా.. తాజాగా నోయిడాలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా దేశ రాజధాని ప్రాంతంలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. ఈ కేంద్రం ద్వారా నోయిడా, ఢిల్లీ, గురుగ్రామ్ పరిసర ప్రాంతాల వినియోగదారులకు టెస్లా కార్లను మరింత చేరువ చేయనుంది. నోయిడాలో ఏర్పాటు చేయనున్న ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రధానంగా కార్ల విక్రయాలకు సంబంధించిన సేవలను అందిస్తుంది. ఇక్కడికి వెళ్లే కస్టమర్లు టెస్లా కార్లను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా.. తమకు నచ్చిన కారును టెస్ట్ డ్రైవ్ చేసి, అక్కడి నుంచే ఆర్డర్ కూడా చేసుకోవచ్చు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఢిల్లీలోని ఏరోసిటీ, గురుగ్రామ్‌లోని సోహ్నా రోడ్‌తో పాటు నోయిడాలోని సెక్టార్ 98లో టెస్లాకు మూడు విక్రయ కేంద్రాలు ఉంటాయి.

## బంగారం, వెండి ధరలు మళ్లీ పైకి

**ఢిల్లీ:** బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకొంటున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండో రోజూ బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల మేలిమి పసిడి ధర శుక్రవారం ఒక్కరోజే రూ.1900 పెరిగి మళ్లీ రూ.1.54 లక్షలకు చేరింది. వెండి సైతం కిలోకు రూ.4,500 పెరిగి రూ.2,28,500కు చేరిందని ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర 1,54,270 వద్ద కొనసాగుతుండగా.. వెండి కిలో రూ.2.29 లక్షలు పలుకుతోంది. అటు అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం 4,194 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి ఔన్సు 61 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ద్రవ్యోల్బణ భయాలున్నప్పటికీ ఇటీవల గరిష్ఠాల నుంచి డాలరు విలువ క్షీణించడంతో పసిడికి మళ్లీ డిమాండ్ ఏర్పడిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూపాయి విలువ క్షీణత వల్ల దేశీయంగా వీటి ధరలు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు.



ఇటీవల సమావేశమైన జీఎస్టీ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. నిబంధనల సరళీకృతం, పన్ను వివాదాల పరిష్కా రాన్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను సులభతరం చేయడం లక్ష్యంగా పలు సంస్కరణలను ప్రతిపాదించింది. రిజిస్ట్రేషన్ వివరాల్లో కొన్ని మార్పులకు వ్యవస్థ ఆధారిత ఆమోదాలు, పన్ను నోటీసులు--ఉత్తర్వుల జారీలో మెరుగైన విధానాలు సహా పలు అంశాలపై నిర్ణయాలు తీసుకుంది. ఈ మార్పులు ముఖ్యంగా అనేక రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు, రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది.

**రిజిస్ట్రేషన్లలో అధికారుల జోక్యం తగ్గింపు**

జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకు, దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేసేందుకు కౌన్సిల్ పలు మార్పులను సిఫార్సు చేసింది. ఏయే పత్రాలు సమర్పించాలి, దరఖాస్తులో ఏ వివరాలు ఇవ్వాలి అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులోకి తీసుకురానుంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో డ్రాప్‌డౌన్ ఎంపికలు, సూచనలు, సులభమైన నావిగేషన్ వంటి సదుపాయాలను మెరుగుపరచనుంది. దీంతో దరఖాస్తుల్లో తప్పులు, అనవసర ప్రశ్నలు, తిరస్కరణలు తగ్గే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ వివరాల్లో మార్పులకు కూడా వ్యవస్థ ఆధారిత ఆమోదాలను సిఫార్సు చేసింది. సాధారణంగా ప్రధాన వ్యాపార స్థలం వివరాలు మినహా ఇతర వివరాల సవరణలను పోర్టల్ ద్వారానే ఆమోదించే విధానం ప్రతిపాదించింది. ప్రత్యేక ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ విధానంలో ఉన్నవారికి ప్రధాన వ్యాపార స్థలం వివరాల మార్పులకూ ఈ సదుపాయం వర్తించనుంది. వ్యాపారాన్ని నిలిపివేసే సంస్థలకు రిజిస్ట్రేషన్ రద్దు ప్రక్రియను కూడా సులభతరం చేయాలని నిర్ణయించింది. పెండింగ్ రిటర్నులు దాఖలు చేసి, బకాయిలు చెల్లించిన తర్వాత నిర్దేశిత అర్హతల మేరకు రద్దు దరఖాస్తులను వ్యవస్థే ఆమోదించే విధానాన్ని తీసుకురానుంది.

**రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రయోజనం**

బెంగళూరుకు చెందిన డెవలపర్ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రాజెక్టు చేపట్టినా, ముంబైకి చెందిన సంస్థ ఇతర రాష్ట్రాల్లో విస్తరించినా ఆయా రాష్ట్రాల్లో పన్ను రిజిస్ట్రేషన్లు, అనుసరణ ప్రక్రియలను నిర్వహించాల్సి ఉంటుంది. కొత్త మార్పులతో రిజిస్ట్రేషన్ వివరాల సవరణలు, అధికారులతో సంప్రదింపుల కోసం పట్టే సమయం తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాలు (జేడీఏలు), అభివృద్ధి హక్కుల బదిలీ (టీడీఆర్), నిర్మాణ ప్రాజెక్టుల్లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వంటి అంశాలపై పన్ను వివాదాలను తగ్గించేందుకు కౌన్సిల్ ప్రతిపాదించిన మార్గదర్శకాలు ఉపయోగపడవచ్చు. అయితే ఈ మార్పులు అన్ని వివాదాలకు స్వయంచాలకంగా పరిష్కారం చూపుతాయని కాదు. పన్ను విధానం, సంబంధిత లావాదేవీల స్వభావం, వర్తించే నిబంధనల ఆధారంగా వివాదాల పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

**పన్ను నోటీసులు, జరిమానాలపై కొత్త నిబంధనలు**

జీఎస్టీ కింద డిమాండ్ నోటీసులు, తీర్పు ఉత్తర్వులు, అప్పీల్ ఉత్తర్వుల జారీలో ఏకరీతి విధానాన్ని తీసుకురావాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది. నోటీసులు సకాలంలో జారీ చేయడం, వాటిలో సరైన వివరాలు పొందుపరచడం, మోసం లేదా వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారనే ఆరోపణలకు తగిన ఆధారాలు చూపడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. పన్ను చెల్లింపుదారులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించడం సహా సహజ న్యాయ సూత్రాలను పాటించాలని సూచించింది. సాధారణ జరిమానా గరిష్ఠ పరిమితిని రూ.25,000 నుంచి రూ.10,000కు తగ్గించాలని సిఫార్సు చేసింది. అలాగే, జీఎస్టీ కింద షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి మొత్తం పన్ను మొత్తం కనీసం రూ.10,000 ఉండాలని ప్రతిపాదించింది. మోసం లేని కేసుల్లో నిర్ణీత గడువులో పన్ను, వడ్డీ చెల్లిస్తే జరిమానాను 5 శాతానికి తగ్గించే ప్రతిపాదన కూడా ఉంది. ఈ మార్పులు చిన్న మొత్తాల వివాదాలు, అనవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను తగ్గించేందుకు దోహదపడవచ్చు.

**జీఎస్టీ అరెస్టు అధికారాల తొలగింపునకు సిఫార్సు**

పన్ను చెల్లింపుదారులకు మరింత ఊరటనిచ్చేలా జీఎస్టీ చట్టంలోని అరెస్టు నిబంధనలను తొలగించాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది. దీనితో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు అవసరమైన పన్ను ఎగవేత మొత్తపు పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచాలని ప్రతిపాదించింది. పన్ను ఎగవేతను అరికట్టే చర్యలను పూర్తిగా తొలగించడం కాకుండా, తీవ్రమైన మోసాలపై చర్యలు కొనసాగిస్తూ సాధారణ వ్యాపార కార్యకలాపాల్లో అనవసరమైన కఠినత్వాన్ని తగ్గించడం ఈ మార్పుల ఉద్దేశం.

**ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి?**

అక్టోబర్ 8న జీఎస్టీ కౌన్సిల్ ప్రకటించినవి ప్రధానంగా చట్ట సవరణలు, నిబంధనల మార్పులకు సంబంధించిన సిఫార్సులు. వీటిని అమలు చేయడానికి అవసరమైన చట్టపరమైన, నోటిఫికేషన్ ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది. పన్ను రిటర్నుల్లో బాధ్యతలు, ఐటీసీ వివరాల సవరణలకు సంబంధించిన కొన్ని మార్పులను 2027 ఏప్రిల్ నుంచి అమలు చేయాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది.

# శతకంతో రెచ్చిపోయిన హోప్

## 250 పరుగుల టార్గెట్‌ను ఊదేసిన విండీస్, భారత్ ఫ్యూజులు ఔట్!




రాంచీ వేదికగా టీమిండియాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ ఆరు వికెట్ల తేడాతో సంచలన విజయాన్ని సాధించింది. భారత్ విధించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని విండీస్ 18.3 ఓవర్లలోనే ఛేదించడం విశేషం. కెప్టెన్ షెయ్ హోప్ (45 బంతుల్లో 102 నాటౌట్, 6 ఫోర్లు, 9 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హోప్‌కు తోడు రూథర్‌ఫోర్డ్ (37 బంతుల్లో 84, 7 ఫోర్లు, 7 సిక్సర్లు) విధ్వంసం సృష్టించగా, ఆఖర్లో రొమారియో షెపర్డ్ (13 బంతుల్లో 34 నాటౌట్, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు తోడయ్యాయి. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 3 వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు.

అంతకముందు టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు చేసింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన ఓపెనర్ సంజూ శాంసన్ (41 బంతుల్లో 82, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) భారీ ఇన్నింగ్స్‌తో అలరించగా, ఇషాన్ కిషన్ (22 బంతుల్లో 43, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) దనాధన్ ఆటతీరును ప్రదర్శించాడు. చివర్లో శ్రేయస్ అయ్యర్ (17 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) గత మ్యాచ్ ఫామ్‌ను కంటిన్యూ చేయగా, తిలక్ వర్మ (18 బంతుల్లో 44 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ మూడు వికెట్లు తీయగా, షమర్ స్ప్రింగర్ రెండు వికెట్లు తీశాడు. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఆదివారం జరగనుంది.

తద్వారా వెస్టిండీస్ తమ టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గతంలో 2015లో దక్షిణాఫ్రికా విధించిన 236 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించడమే ఇప్పటివరకు ఆ జట్టుకు అత్యుత్తమంగా ఉండేది. తాజాగా టీమిండియాపై 250 పరుగుల టార్గెట్‌ను ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 2024లో ఇంగ్లండ్ విధించిన 221 పరుగుల టార్గెట్‌ను 5 వికెట్లు కోల్పోయి 19 ఓవర్లలోనే ఛేదించింది.

ఇక 2016లో ముంబై వేదికగా టీమిండియా విధించిన 196 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ 19.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. 2017లో కింగ్‌స్టన్ వేదికగా భారత్ విధించిన 194 పరుగుల లక్ష్యాన్ని 18.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేధించడం విశేషం.

ఇక అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో చేజింగ్‌లో వెస్టిండీస్ ఛేదించిన 250 పరుగుల లక్ష్యం రెండో అత్యుత్తమం. 2023లో ఇదే వెస్టిండీస్‌పై సౌతాఫ్రికా 259 పరుగుల లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి ఛేదించడం ఇప్పటికీ ప్రపంచ రికార్డుగానే ఉంది.

## పాక్‌తో మ్యాచ్; బరిలో భారత దిగ్గజ క్రికెటర్ల కుమారులు!



ఒమన్ వేదికగా నవంబర్ 5 నుంచి 14 మధ్య అండర్-19 ఆసియా కప్ జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి భారత యువ జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్‌లు ఈ టోర్నీలో ఆడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టోర్నీకి ఇంకా జట్టును ప్రకటించనప్పటికీ ఈ ఇద్దరు ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవలే సొంతగడ్డపై ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో అన్వయ్, ఆర్యవీర్‌లు అదరగొట్టారు. ఈ ఇద్దరు రాణించడంతో భారత యువ జట్టు 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఇక ఆసియా కప్‌లో గ్రూప్ దశలో భారత యువ జట్టు పాకిస్తాన్, నేపాల్, యూఏఈతో మ్యాచ్‌లు ఆడనుంది. ఒకవేళ ఆర్యవీర్, అన్వయ్‌లు ఎంపికైతే మాత్రం గతంలో వీరిద్దరి తండ్రులు కలిసి పాకిస్తాన్‌ను చీల్చి చెండాడినట్లే.. ఇప్పుడు వారి కుమారులు కూడా అదే పాక్‌పై తమ ప్రతాపం చూపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇక ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ నవంబర్ 8న జరగనుంది. గత ఆసియా కప్‌లో అందరి కళ్లు వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మహాత్రేపై ఉన్నట్లే ఈసారి ఆసియా కప్‌లో ఆర్యవీర్, అన్వయ్‌లు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనున్నారు. అయితే 2025 అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్ 191 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసి ట్రోఫీ ఎగరేసుకుపోయింది. అయితే 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై గెలిచిన భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

స్పోర్ట్స్

## సౌతాఫ్రికా బౌలర్ల విజృంభణ.. ఆసీస్‌ను రక్షించిన బ్యాడ్‌లైట్



డర్బన్ వేదికగా సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో మొదటిరోజు ఆట ముగిసింది. వెలుతురులేమి కారణంగా రెండు సెషన్లు పూర్తయిన తర్వాత ఆటను నిలిపివేశారు. అయితే తొలిరోజు ఆటలో సౌతాఫ్రికా బౌలర్లు చెలరేగారు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో రోజు ముగిసే సమయానికి ఆరు వికెట్లు నష్టపోయి 187 పరుగులు చేసింది. మాట్ రెన్‌షా (46 నాటౌట్), కెప్టెన్ పాట్ కమిన్స్ (33 నాటౌట్) క్రీజులో ఉన్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్, వియాన్ ముల్డర్, నోర్జ్టే తలా 2 వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఏ దశలోనూ కలిసిరాలేదు. ఓపెనర్లిద్దరు తొందరగానే పెవిలియన్ చేరగా, లబుషేన్ (37), స్మిత్ (25) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, భారీ స్కోర్లు చేయడంలో విఫలమయ్యారు. ఆ తర్వాత వచ్చిన వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ (14), బ్యూ వెబ్‌స్టర్ (4) కూడా తొందరగానే పెవిలియన్ చేరడంతో 124 పరుగుల వద్ద ఆరు వికెట్లు కోల్పోయింది. ఇక అంతకముందు పదేళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన ఆస్ట్రేలియా ఓపెనర్ నిక్ మాడిసన్ 33 బంతులాడి పరుగులేమి చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో టెస్టు క్రికెట్‌లో లాంగెస్ట్ డకౌట్ (బంతుల పరంగా) అయిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు. ఇక స్టీవ్ స్మిత్ ఆసీస్ దిగ్గజం స్టీవ్ వా రికార్డును బద్దలుకొట్టి టెస్టు క్రికెట్‌లో ఆసీస్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు.